రెండవ సంపుటము

2

13423

శాంకరీ శతకము

బాలకవి
శ్రీరంగం శీతారామయ్య.

ప్రకాశకులు:
శ్రీ దేవీభక్త సమాజకులు,
భద్రాచలం.

వెల 0-4-0

అంకితము
శ్రీ రాజరాజేశ్వరికి

రాబోవు మా పుస్తకములు

నిష్కామ్యపూజ (నాటకం) శ్రీ దేవీ హరికథలు : 1 మధుకైటభ-వధ 2 మహిషాసురమర్దని. పద్యకావ్యము: భద్రగిరి వైభవము. భద్రాద్రి రామనామ భజనకీర్తనలు.

: స్టాకిష్టులు .

నల్లూరి సర్వేశ్వరరావు అండ్ కో, జర్ల సీతయ్య
కిరాణా, ఫ్యాన్సీ, జరన్ అండ్ బుక్‌షాప్
భద్రాచలం (తూ॥ గో॥ జిల్లా)

పండితాభిప్రాయములు

శ్రీ శ్రీరంగం సీతారామ సూరిణా విరచిత మిదం శాంకరీ శతకం మయాదృష్టం, పరిశోధితంచ తస్యాం కవితాయాం శైలీ అతిమనోహారిణీ, పండిత - పామర సర్వజన హృదయంగమాచ, అస్మిన్ గ్రంథే పద ప్రయోగాణి మృదుమధుర సుగమ భూయిష్ఠాని. అతః ఏతద్గ్రంథం పఠిత్వా సర్వేజనాః భవానీ కటాక్షేణ సకల మనోరథాని ప్రాప్నుయాత్.

చల్లా కోదండరామయ్య,
దేవస్థానం పండిట్ - భద్రాచలం.

ఈ శ్రీరంగం సీతారామయ్యగారు మా కుటుంబమునకు చిరపరిచితులు. వీరి పూర్వీకులు వెనుక శ్రీ భద్రాచల శ్రీ సీతారామచంద్ర మహాప్రభువు వారి కైంకర్యముకొరకు శ్రీ రామదాసుగారిచే గొనిరాబడిరి. వీరిది పండితవంశము. కవి కుటుంబము. హరిదాసులు - భజనపరులుగా చిరకాలమునుండి ఆలయమున సేవజేయుచున్నారు. అట్టి పవిత్రమైన వంశరత్నాకరము నుండి యీ బాల కవిరత్న ముదయించుట ఆశ్చర్యమేమియు గాదు. చిన్నతనమునుండి తగిన భాషా సంస్కారములు లభింపకపోయినను వీరు స్వయంకృషిచే సహజ ప్రతిభా వ్యుత్పత్తులచే తగిన సారస్వతసేవ గావించి, నాటకములు - గేయములు - చిట్టి కథలు, మొదలగు వానిని ఆధునిక పద్ధతులలో మిక్కిలి రసవం

తముగను ఆకర్షణీయముగను రచించి పండిత పామరజన స్తుతి పాత్రులగుచున్నారు.

వీరి యీ శాంకరీశతకమును నే నామూలాగ్రముగా చదివి యానందించితిని. క్రొత్తతీరుల సమాసములు, వింత వింత వర్ణనలు, సొగసైన యలంకారములు వీరి కావ్యమునకు వన్నె దెచ్చినవి. యిందలి కవిహృదయవేగము నవీనమార్గముల ద్రొక్కుచున్నది. లౌకికమైన క్లిష్టసమస్యలను కవి చక్కగా గ్రహించి సమాజమునకు నీతి బోధ జేయుచున్నాడు. ఈకాలమున నిట్టి వాఙ్మయము సంఘమునకు మిక్కిలి ప్రయోజనకరము.

దీనిని సంపూర్ణముగా భక్తితో పఠించినవారు శాంకరీ కరుణా కటాక్ష వీక్షణముచే నాయురారోగ్య భాగ్యముల నందగల రనుటలో నత్యుక్తి లేదు.

సాధ్యమైనంతవరకీ శతకమును నిర్దుష్టముగను, గుణోపేతముగను నుంచ ప్రయత్నించితిని. శతక కావ్యరచనలో ప్రథమ ప్రయత్నమును సహృదయులు హర్షించి యాంధ్రభారతికి చేయూతనితురుగాత!

ఇట్లు
సాహిత్య శిరోమణి, సంస్కృతకోవిద
విద్వాన్: పొడిచేటి శ్రీరంగాచార్యులు
అర్చకులు: భద్రాచలం.

నేను యీ శాంకరీ శతకమును గ్రంథకర్త వినిపించగా నామూలాగ్రముగా గాకపోయినా స్థాలీపులాకన్యాయముగా నచ్చటచ్చటవింటిని. పద్యములనుటతోడనే కొందఱు సాధారణముగా కవిత్వ దృష్టితోనే పరికింతురు; కాని, వస్తు ప్రాధాన్యమునుబట్టి యీవస్తువునందలి గౌరవమునే పరికించుట విబుధుల మతము.

శబ్దాలంకారములు, శృంగారాదిరసములు, శైలి, పాకము వీటినిగూర్చి ప్రత్యేకలక్షణము లిందు గలవా? యను సంశయము బొందక సహృదయులు సవిమర్శముగా గీ గ్రంథమును పఠించినచో నా యీ ఘట్టములు హృదయరంజకములు గాకమానవు.

ఈ కవి-కిశోర మీ గ్రంథమునే గాక "వేమన, యధార్థ వాది"యను నాటకములను "దొరలపోటీ" అను పద్య గేయ గుచ్ఛమును రచించి వాఙ్మయరంగములో కొంత పరిచితుడై యున్నాడు.

ప్రత్యేకముగా నీ శాంకరీశతక పఠనముచే పాఠకులు భక్తి భావప్రపూర్ణ మానసులగుటలో ఆశ్చర్యములేదు. దానికి కవిచే వర్ణింపబడిన శాంకరీదేవి గాథా వర్ణనములని చెప్పకతప్పదు.

ఈ కవిని నా చిన్నతనమునుండి చూచుచున్నాను; కాని ఈతనిలో నింత భక్తియున్నదని గ్రహించలేకపోతిని. నేటి కీ చిన్నపొత్తమువల్ల నాతని హృదయాంతర్గత భక్తిభావము నాకు సాక్షాత్కరించినది.

"తినుటకు తిండిలేని కడు దీనుల" అను పద్యము నేటి దేశపు వాతావరణమును సూచించునదియై దేశస్థితికి, దేశము లోని నీచవర్తనలకు కవిహృదయ మెట్లు ఘోషించుచున్నదో! సాక్ష్య మిచ్చుచున్నది.

ఈ కవి-కిశోరుడు ముందుముందు దేశోపకారములైన రచనలచే నాంధ్రవాణి నలంకరించునని యాసించుచున్నాను.

ఇట్లు
సంగీత, సాహిత్య విశారద
విద్వాన్: జి. రాజగోపాలాచార్యులు
గవర్నమెంటు హైస్కూలు-తెలుగుపండిట్
వెంకటాపురం.

-: ఆశీస్సు :-

శాంకరి సన్నుతించి సరసమ్ముగ గూర్చిన పద్యముల్, తదీ
యాంకితమైన భక్తిని బయల్పడజేసెడి నిందు, నిట్టివౌ
పొంకము మీఱ సంస్కృతులు-ముందిక నెన్నియొ వ్రాయజేయ-
నా శంకరుదేవి బాల కవిచంద్రు హృదంతరమందు గ్రాలుతన్॥

ఇట్లు
కొండపల్లి రామచంద్రరావు
దేవస్థానం మేనేజరు: భద్రాచలం

మొదటి విషయం

శ్రీరామచంద్రుని స్థిరముగానిల్పిన
తపసి భద్రుని మేటి ధర్మభూమి
వైకుంఠునకు తాటి-పండ్లిడి మోక్షమ్ము
నందిన, భక్త-దమ్మక్క తావు
రామభద్రుకు మేటి-రత్నాల-గృహమిడి
త్యాగియౌ శ్రీరామదాసు ధరణి
శ్రీరఘూద్భవు పాద సేవచే తరియించి
నట్టి నృసింహాఖ్యు డాడు చోటు

నిరతమంబను మనసులో నిల్పుకొన్న
వేంకట రమణ దాసాది-విబుధ రామ
తీర్థ మనగను గౌతమీతీర మొప్పు
భద్రగిరియందు శ్రీదేవి భక్త సంఘ
కార్యకర్తల ప్రియమైన గ్రంథమిద్ది.

తల్లి రాజేశ్వరికి పుష్ప-దామ మనగ
శాంకరీ గాథలెల్లను శతకముగను
గూర్చి యర్పించినాడ; భక్తులకు దేవి
ప్రేమ దెల్పుకొని మిగుల ప్రీతిజెంద॥

భద్రగిరియందు జనియించి భక్తజనుల
ప్రేమచే "బాలకవి"యని పిలువబడితి
నంతియేగాని పండితులందు మేటి
గాను; దాసానుదాసుడ నేను నిజము॥

ఉ॥ భక్తిని దేవి పాదుకలబట్టి రచించిన గ్రంథమిద్ది, నా
శక్తిని గాదు, మిత్రుల-హుషారులపల్లనెగాదు, శాంకరీ
శక్తిని వ్రాసినాడ, నిక చౌకగ బల్కును యిందు లాభముల్
భుక్తికి వాడ,నా భువనమోహిని భక్తిని జాట జూచెదన్॥

దీని-పరిశోధనముజేసి దీవనల-నొ
సంగినట్టి పండితులకు, సత్య మార్గ
మరయు శ్రీదేవి-సంఘ-కార్యాధికులకు
నా-నమస్సులు సతము సన్మానమొప్ప॥

ఇట్లు
గ్రంథకర్త
శ్రీరంగం సీతారామయ్య, భద్రాచలం.

శాంకరీ శతకము

శ్రీ విమల స్వరూపమున-జిందెడు ప్రేమరసమ్ములోన శో
భావహమై జగత్త్రయము భాసిలుచుండ మహాత్ములెందరో
నీ వచనములోన కడు నిర్మల చిత్తముతో వెలుంగగా
పావనమైన నీదు పద పద్మములన్ మదిగొల్తు శాంకరీ॥ ౧

ఉ॥ శ్రీపతి తేజమున్, హరుని చేవయు నాల్గుమొగాల వానిదే
దీపటిమంబుతో సలరి, దృష్టికి భీకరమై వెలుంగగా
బాపుల గూల్ప కైదువులబట్టియు సింగము నెక్కివచ్చు, నీ
ప్రాపుకు జేరగాదరమె భక్తివిధానము లేక శాంకరీ॥ ౨

ఉ॥ శ్రీయన, నల్వచల్వయన, స్త్రీయన, గౌరియనంగ నీవె, నీ
మాయను యీ జగజ్జనులు మాటుననున్న పథంబుగానకే
కాయము కొద్ది వేడుకలకై యిడి, లోతగు పాపకూపమం
దే యిరవొంది నీ వెలుగు నింతయు గానగలేరు శాంకరీ॥ ౩

ఉ॥ దోసపు మేఘపంక్తులను దోలెడి వాయువు నీవు, ధర్మముల్
బాసి చరించు దుర్మతుల పాలిటి పక్కను బల్లె మీవు, యీ
మోసపు కారుచీకటిని మోదెడి వెల్గువు నీవు, మేటి రా
కాసులకెల్ల మృత్యువనగా తగుదానవు నీవు శాంకరీ॥ ౪

ఉ॥ మూడుజగాలనిండి, యల ముగ్గురు మూర్తుల కీర్తినంది మా
గోడునుగాంచి దుర్మతుల గూల్చగ సింగము నెక్కి వేగమే
వాడి శరమ్ములంది యతి పాపుల రూపణగించునట్టి నీ
కీడగు మేటి-మాత లిక యెందును లేరుగదమ్మ శాంకరీ॥ ౫

చం॥ కలికి-కనంగబోవు పసికందుని యాకటికై కుచమ్ములో
నిలువుచు నీవు పాలను, యనేకవిధమ్ములవెల్గు పుష్ప-జా
తుల యభివృద్ధికై హిమము, తోయము, వాయువు, అగ్ని
జీవికై
గలుగగజేయు నంబవు,జగంబుల రాణివి నీవె శాంకరీ॥ ౬

ఉ॥ ఎవ్వరిప్రేమచే పవను డీ జగమందు చలంగు? భాస్కరుం
డెవ్వరి ప్రేమచే వెలుగు? యింపగు జీవనదుల్ చరించు నిం
కెవ్వరి ప్రేమచే? సమయమెంచి గ్రహమ్ములు వెల్గుచుండు దా
మెవ్వరివల్ల? ప్రేమమయి నీవె గదా పరికింప శాంకరీ॥ ౭

చం॥ నిలువక చిత్త మొక్కెడ యనేకవిధమ్ముల నాడుచుండిన-
పలుమరు నిన్ను వేడు నిజభక్తజనాళి మనోవికాసమున్
గలుగగజేతువమ్మ యుపకారము నీవగుసొమ్ము గానిచో
చిలిపితనంపు మానసులు జేరుదు రెట్టుల నిన్ను శాంకరీ॥ ౮

ఉ॥ సర్వజగమ్ములందు దగు శాంతినిగూర్చెడి లోకమాత ని
న్నుర్వి జనమ్ము గొల్వదగు నోర్పును భక్తిని గల్గజేతువే
దుర్విషయమ్ములొప్పి కడు తుచ్ఛసుఖమ్ముల యాశచేతనే
యుర్విజనమ్ము నిండి రిక నోర్పున గాంచెద వెట్లు శాంకరీ॥౯

చం॥ తనవలె సర్వభూతముల దల్చి పవిత్రమనమ్ముతోడ ని
న్ననిశముగొల్చి ధర్మపథమందున నిల్చినవారికెల్ల ని
న్గనుగొను భాగ్యమబ్బు ధర కష్టచయమ్ములు మాయుగాని, ని
న్గనుగొనలేక పాపములఁగాంచిన మోక్షముఁబన్నె శాంకరీ॥ ౧౦

చం॥ మనసును చెడ్డకోరికలమాటున నుంచక నిశ్చలత్వ మం
దునిచి భపత్పదమ్ములిక నొక్కెడ నమ్మిన మోక్షమిచ్చు నీ
కనికర మింత-యంతయని కాంచగ వేల్పులకైన సాధ్యమా!
మనసునెరింగి భక్తుల సమంబుగనేలెడు తల్లి శాంకరీ॥ ౧౧

చం॥ స్థిరమగు చిత్తమున్.బలము.తేజము,శౌర్యము నీదెయంచు ని
న్నరయగ ధర్మసౌధములయందున శాంతిని వేగ నిల్పగా
త్వరపడి భోగముల్ విడచి త్యాగపథమ్మును జూపి రెందరో!
తరచుగ వేడువారలకు దాపుసె మోక్షమొసంగు శాంకరీ॥ ౧౨

ఉ॥ నీ విమలస్వరూపమున నిండిన ప్రేమరసమ్ముచేతనే
పావనమౌను లోకములు, ఖండనమందున పాపజాలముల్
చేవ నడంచు నీ భృకుటిసీమపయిన్ ముడిపడ్డ రేఖలే!
యీ వసుధాస్థలిన్ ఖలుల కెంచగ శక్యమె నిన్ను శాంకరీ॥౧౩

చం॥ తరుగని పాపవార్ధి నిల దాటగలేని జనాళి భక్తి ని
న్నరయగ పిచ్చికోరికల నన్నిటి వీడియు వేడెనేని నీ
దరి కిక జేర్చు నాసనిడి ధర్మపతాకము జూపి వేగమే
పరమకృపారసమ్ము నిజభక్తులపై జిలికింపు శాంకరీ॥ ౧౪

చం॥ అనలుని శక్తి,వారి నిలయమ్ము,భానుని తీక్ష్ణభావమున్
అనిలు ధాటి నీయదె గదమ్మ !జగజ్జన ధైర్యదాయినీ
అనిశము నిన్ను వేడు జనులందున నీవగు శక్తిజూపి,నీ
ఘనమగు విశ్వప్రేమ భవఖండన మీదెసజూపు శాంకరీ॥ ౧౫

ఉ॥ భారతవీధి ధర్మములపంట విలాస-వినోద-పుణ్య-భూ
మీ-రమణీయ సౌధమున మెట్టులు గూలినవేళలందు,నీ
దారుణి నీవు రూపములదాల్తువు,భీకర-ఘోరశక్తివై
మీరిన సోకుమూకలను మేదిని గూల్చగనెంచి శాంకరీ॥ ౧౬

ఉ॥ సత్వరజస్తమోగుణ విచారణ జేయగలట్టి మేటి నీ
తత్వము యోగదృష్టిగల ధన్యులకే గననౌను గాని,యా
సత్వగుణమ్ములేక,తగు సత్యము-ధర్మము-శాంతి-భక్తి యో
గత్వములేక నిన్ను గనగా తగియుందురె !తల్లి శాంకరీ॥ ౧౭

ఉ॥ అద్దెలకొంప దేహ మిది,ఆర్గురు శత్రులు జేరియుందు రా
సుద్దులు పూలగుత్తులటు సొంపుగనుందును కొన్నినాళ్లె,యీ
కొద్ది దినాల భోగమును గోరుచునుందును బుద్ధి,దీనినే
హద్దునబెట్టు ధీరులు మహాత్ములె నిగ్గనుచుంద్రు శాంకరీ॥ ౧౮

ఉ॥ గండుతనంబు ధర్మమునకై యిడువాడు సుబుద్ధి భక్తుడై
యుండి భవత్పదంబులనె యొప్పుగనమ్మి భజించుచుండి నీ
యండకు జేరుగాని, పరులందున లాభముగోరు నీచ భ
క్తుండగువాడు నీప్రియులకున్ తగిరాడుగదమ్మ శాంకరీ॥ ౧౯

ఉ॥ నీ పదపూజ సేయదగు నేర్పరి కేదెస కస్తిలేదు ;నీ
దాపు నుపాసనాపరుల తంత్రము కెన్నడు చేటులేదు,నీ
ప్రాపుకు జేరదల్చు నిజభక్తుల కెందున భీతిలేదు, బల్
కోపికి,ధర్మహీనునకు గోరముబోదు గదమ్మ శాంకరీ॥ ౨౦

ఉ॥ ఉద్దిగ నన్నిజీవులకు నోగిర మీగల దేవి వీవు,నీ
గద్దెకుజేరి వేడుకొనగా మదికోర్కెలదీర్చు తల్లి వే
విద్దెను నేర్చదల్చునెడ ప్రేమరసమ్మును జిమ్మ వాణి,నీ
వద్దకుజేరు యోగులకు బమ్మపదమ్మునుజూపు శాంకరీ॥ ౨౧

చం॥ సతి-సుత-బంధుకోటికిని సజ్జనుడైన,కవీంద్రుడైన,బల్
వ్రతములు సల్పినన్,మిగుల పాటలు బాడిన, యాటలాడినన్
మతముల సారమెల్లగొని పండితులందున మెప్పులందినన్
గతిగని బుద్దినిల్పి నిను గానక మోక్షములేదు శాంకరీ। ౨౨

ఉ॥ నీ దరిజేర గొల్చెదము నిశ్చలభక్తిచెగాని యజ్ఞ యా
గాదుల జేయలేము,కలికాలపు దుర్బలజాతివారమే
నీదు పదారవిందములనే భజియించెద మమ్మ ప్రేమతో
గాదనకుండ నీ వెలుగుగడ్డకు జేర్చవె మమ్ము శాంకరీ॥ ౨౩

చం॥ తొలిదగు ధర్మమార్గములతో దులదూగెడివారు లేరు యీ
కలియుగమందు,కాని నిను గట్టిగనమ్మి మనమ్ములోన నే
కలుషములేక గొల్చెదము కష్టచయమ్ములు బోవ భక్తిచే
నలయికయైన మాహృదయమందున నీ వెలుగుంచు శాంకరీ॥

ఉ॥ ఈ జగ మీషణత్రయము లెంచి వికారపుచేష్టలందు పో
గా జిగి తగ్గజొచ్చె,యుగకాల విభావ మదేమొగాని,యీ
రాజులుగూడ ధర్మపదరక్షణ మానినయట్లు కోచు, నిం
కీ జగమందు దీనులకు నేగతి నిచ్చిన నీవె శాంకరీ॥ ౨౫

ఉ॥ కాలము మారిపోయె తొలికాలపు బాటల కెన్నొ రెట్లు,యీ
కాలము సత్య,శాంతియుతకాలముగాదు గదమ్మ, భక్తులన్
బోలినవారెగాని తగుబుద్ధిని నిశ్చల-భక్తితోడ నీ
లీలలనెంచువా రెవరు లేరుగదమ్మ తలంప శాంకరీ॥ ౨౬

చం॥ తెలిసినవారు విద్యల, సతీసుత బంధువులెల్ల వెల్ల-శ్రీ
గలిగినవారు,ప్రేమరసఘట్టము లెన్నియొ వగ్గివేసి త
ల్లుల విడనాడువారు,కలలో దివిజేంద్రుని జేరువార, లీ
కలియుగమందు బిడ్డలిక గాచెడిభారము నీదె శాంకరీ॥ ౨౭

చం॥ అరయగ సాధువేషధరు లంతట నిండిరి, ధర్మమేగె, నీ
ధర కడు నీచభక్తులకు దగ్గరబంధులు కామదాసు లీ
దురితపు నీదు సంతతి యధోగతిపాలగు కాలమాయె-నీ
కరుణను జూపి, యిందరను గాచెడి తల్లివి నీవె శాంకరీ॥ ౨౮

చం॥ తినుటకు తిండిలేని కడుదీనుల హీనుల జూడబోని బల్
ధనికులు దేశరక్షణ పతాకములే దగిలించుకొంచు,యే
పనియును జేయబోక కడుబాసలజేతురు కొంద రీగతిన్
కనికరమింతలేని ధరగాచెడి భారము నీదె శాంకరీ॥ ౨౯

ఉ॥ రాముడు,కృష్ణుడున్,ఋషులు,రాజులు,బుద్ధులు,ధర్మదేవతల్
కామవిరోధులున్ వెలసి కాంతియు,సత్యము,శాంతి నిల్ప రీ
భూమిని నేటికాలమున పూజ్యులు కొందరు ధర్మచింతలో
నీమము దప్పిపోయి రిక నీవె మముస్ దయనేలు శాంకరీ॥ ౩౦

ఉ॥ మోదములేని యీజగతి మోసముతోడనె నిండుచుండె, నీ
వే దయనేలకున్న తగుప్రేమ జగమ్మున మాసిపోవు, మా
వేదన మాన్పకున్న కడు భీకరసింహము నెక్కనేల ? నీ
మోద మదేల? ధర్మపథమున్ తగనిల్పవె తల్లి శాంకరీ॥ ౩౧

ఉ॥ కాదనబోక వేగ నుపకారముజూపెడి తల్లివీవె మా
పేదతనంబు బాపగల పెన్నిధి వీవె జగాన, నీకు పై
నేదియులేదు ప్రేమమయవెందున భైరవి! ఆదిశక్తి ! నీ
పాదములంటి వేడెదము పాలనజేయవె తల్లి శాంకరీ ॥ ౩౨

చం॥ ధర నిను వేడుకోదగిన తాలిమిలేని జనమ్ము ; లోభులై
పరము నెరుంగలేక యిహభాగ్యమె సర్వసుఖమ్మటంచు నే
వెరపునులేక భోగముల వేడుచునుండిరిగాన యిట్టి నీ
దరిగనలేని లోకమున ధర్మము నాటవె తల్లి శాంకరీ ॥ ౩౩

ఉ॥ స్వార్థపరత్వమే నిలచె, సత్యము ధర్మము సన్నగిల్లె, భో
గార్థములెల్ల దుర్మతుల గట్టుననిల్చెను, వేదశాస్త్ర - కా
వ్యార్థములేగె,కుత్సితులు భక్తులరూపము దాల్చి రింక ధ
ర్మార్థముజూపి గావదగు మాతవు నీవెగదమ్మ శాంకరీ॥ ౩౪

ఉ॥ కానక నీ మహత్వ మతి కామవిధేయుల దాసులై యిదే
మానవజాతి లక్షణము, మన్మథరాజ్య మటంచు వాదుకే
బూనెడివారితో జగతి పుణ్యము తగ్గుచునుండె, నీదు సం
తానము నేలుకోవె! తగుధర్మము నిల్పవె! తల్లి శాంకరీ॥ ౩౫

చం॥ అధికధనమ్ము గూర్చుటయు, హాయిగ భోగము లందు కొంటయున్
అధికుడటంచు లోకు లనునట్టుల వేషములేయుచుంటయే
బుధుని విధంబటంచు కడు బొజ్జలబెంచిరి మత్సరాలతో
నధిక జనమ్ముగాన పరమార్థపుబాటను జూపు శాంకరీ॥ ౩౬

ఉ॥ బొబ్బమెకమ్మునెక్కి అనిపోతులనెల్లనుగూల్చి యంత నా
బెబ్బులి రీతిగా నిలిచి భీకరదుష్టుల రూపుమాపు నీ
బొబ్బ; సమస్తలోకముల మోదముగూర్చెడి శాంతి, పాపమౌ
జబ్బులకెల్ల నీపదమె చల్లని యౌషధమమ్మ శాంకరీ॥ ౩౭

ఉ॥ నీ నగుమోములో జగతి నిర్మల శాంతి వహించు,దుర్మతుల్
గానక కూలిపోవగనె,కర్మయు-ధర్మము నాశ్రయించు,నీ
గానములో జగత్త్రయము కమ్మని తావుకు జేరు వేగ,నీ
మౌనముమాని శాంతియుత-మార్గము జూపవె మాకు శాంకరీ॥ ౩౮

ఉ॥ నీ వనిలోన నిల్వ రవి నిల్వగలేడు, భవత్ప్రితాపమా
చేవయు, మేటిరక్కసుల జిందరవందరజేయు,లోకముల్
కావగజేయు, నీ ప్రళయగర్జినముందర పాపజాలముల్
బోవక నిలచునా ?అమర పూజ్య వినోదినివమ్మ శాంకరీ॥ ౩౯

ఉ॥ తొల్లి భవత్ప్రతాపమున దోసములన్నియు గూలె, శాంతి నీ
వల్లనె నిల్చె, కీర్తిగల భారతదేశమునందు గాని, నే
డెల్లెడ సత్యమార్గముల యింపు నసించెను, నీతిమాసె, బల్
కల్లరిలోకమాయె నిక గాచెడి భారము నీదె శాంకరీ॥ ౪౦

ఉ॥ కోరికతోడ వేడునెడ కోర్కెల దీర్తువు ప్రేమతోడ, నీ
ధీరతనెంచి పాడుకొను దీనుల రక్షణ జేతువమ్మ-నిన్
జేరి భజించువారలను జేకొని యోగులజేతువమ్మ యీ
కారణదేహధారులను గామ కృపామయి యమ్మ శాంకరీ॥ ౪౧

ఉ॥ స్వార్ధముతోడ భూతదయ సంకకు జూడక, జీవితమ్ము భో
గార్ధముకే నటంచు పరమార్ధము నెంచక శాంతివీడి త
త్వార్ధముగాంచకే కలుషమానసులైనను వారి కీవు-భో
గార్ధములిచ్చి దుఃఖతతులందున ముంతువు వెక్క శాంకరీ॥ ౪౨

చం॥ మరతురె నీ మహాత్త్వముల మర్మమెఱింగినవారు, ప్రేమతో
నరసెడు నీ దయారసము నందెడివారును, భక్తితోడ నీ
దరిగన గోరువారు కడు ధర్మ-పథమ్మున మంత్రతంత్రముల్
తరచెడివారు కష్టములవాకిన జంకరుగాదె శాంకరీ॥ ౪౩

ఉ॥ తలపగ జంతుకోటివలె ధర్మవిధేయులు, బొట్టబెంచుకో
దలచెడి కార్యముల్ గనరు; ధన్యులకెన్నడు నిందదేరు, నిన్
దలచి భవాంబుధిన్ గడుపదల్తురు, నీ పదభక్తి నౌకచే
చలనములేని నీ దరిని శాంతమునెంచియు గొల్చి శాంకరీ॥ ౪౪

ఉ॥ తా వరమందె నన్యుడని దార్కొన శక్యముగానటుల్ హయ
గ్రీవుడు వేడి కాని,తన కీడగు రూపమువాడు జంప నౌ
గావున శ్రీనివాసు హయకంతు నొనర్పుడు వేగ నా హయ
గ్రీవుని రూపు దాల్చునని కీడు దొలంగగ జెల్పు శాంకరీ॥ ౫౫

ఉ॥ ఆ త్రిపురాసురాళి పుటమార్చగ భీకరరూపు దాల్చి నీ
వా త్రిదిశుల్ సుఖింపగ నయంబున గూర్చితి వంత వారు నీ
క్షేత్రమునందు పాపములు జేరవటంచును బల్కినారు, నీ
గాత్రము దాసరక్షణకు కందదొ యేమొ యొకింత! శాంకరీ॥ ౫౬

ఉ॥ ఆ మహిషాసురుం డతి భయంకరుడై చెలరేగె మున్ను నా
కామి విధాత సృష్టి నిల గాల్చుచు చేడెల బాధబెట్టు యే
నీమము నీతిలేని కడు నీచపు కార్యములెల్ల జేయు నా
తామసిరూపు మాప విబుధాళి నుతించెను నిన్ను శాంకరీ॥ ౫౭

ఉ॥ గర్వము మించు నా యసుర కల్పితపాలనముందు భూమి పల్
దుర్విషయప్రమత్తులకు తొత్తుల కింపగు రాజ్యమాయె శ్రీ
సర్వ విధానమేగ తగు సత్యము ధర్మము రూపుమాయ నా
గర్విని గూల్ప దేవతలు గట్టిగ వేడిరి నిన్ను శాంకరీ॥ ౫౮

ఉ॥ ఆవిని యాతుధానులు మహాభయరూపము దాల్చి లోకముల్
చేయుచు దైవభక్తులను చింపర వంపరజేయ దేవులే
యీదెసగాంచి వేడ వయనేలగ సింగమునెక్కి భీకరం
బై దివికెక్కు దుర్మతుల పాప మడంచగలేదె శాంకరీ॥ ౫౯

ఉ॥ఆ మహిషాసురానుచరు లద్భుత భీకర దుష్ట యోధులై
యీ మహి యోగులన్,ఋషుల,నీశ్వరభక్తుల,హింసబెట్టుచుఁ
కాముకులై పవిత్ర కులకాంతలబట్టియు బాధబెట్టు నా
తామస సంఘ మార్ప నిను దాసులు వేడిరిగాదె శాంకరీ॥౬౦

ఉ॥ ముక్కులుమూసికొంచు నొక మూలను జేరెడి మౌనులందఱన్
జిక్కులు బెట్టుచున్ కరుణ జీవులగూల్చుచు విప్రసంతతిన్
దక్కగనీక భక్తులను దన్నెడి యా మహిషాసురవ్యథన్
జిక్కులు బోవ వేలుపులు జేరి భజించిరి నిన్ను శాంకరీ॥౬౧

ఉ॥ ఆ మహిషాసురుం డమరు లందఱ నాజిని నోడజేసి ధ
ర్మామరపీఠమెక్క; సురరాజు, శివుండు, విధాత, విష్ణువున్
నీ మహిమంబులెంచి యిక నీచుల గూల్చెడిదేవి నీవె యం
చేమరు వేడినారు గద యింపగు నీ ఘనశక్తి శాంకరీ॥ ౬౨

చం॥ అసురుల కర్మమందర మహాత్ముల మాటలు నిల్వవయ్యె తా
పసుల విధానమా! మునుపె పచ్చడిలాగున మోదినారు, మే
టి సురలు భీతిలంగ వికటించిన దుష్టులు మించిపోయి రా
యసురులగూల్ప నీవె తగునంచు విధాతయె బల్కె !
శాంకరీ॥౬౩

ఉ॥ భగ్గునమండె సత్యమగు బాటలు ధర్మము-వేదశాస్త్రముల్
తగ్గుచునుండె దుర్మతుల దాడికి లోకములెల్ల భీతిలన్
ముగ్గురు మూర్తు లా ఖలులముందర నిల్వగలేకయున్న-నా
యెగ్గును మాన్ప భూతపతి యెంచి నుతించెను నిన్ను !
శాంకరీ॥౬౪

ఉ॥ కూలిన సత్యసౌధముల గూర్పగ- ధర్మము చక్కబెట్ట బో
దోలిన దైవభక్తి యట దూకొని మీరిన యాతుధానులన్
దోలగ మేటి శక్తిగల ధీనిధివంచును సర్వశక్తి నీ
మ్రోల చలంగునంచు హరి ముందుగ నిగ్గని తెల్పె
శాంకరీ॥ ౬౫

చం॥ అరయగ నాదిశక్తివని,అంబవు నీవని,మూడులోకముల్
వెరపునులేక భాగ్యమున వెల్గగజేసెడి దానవంచు నీ
దరిశనమే జగత్త్రయ-విధానము జాటునటంచు దిక్పతుల్
విరివిగ వేడినారు నిను!ప్రేమనిధీ!శుభగాత్రి!శాంకరీ॥ ౬౬

ఉ॥ దీనుల ప్రేమతో గనెడి తేజము నీ కనులందు వెల్గ,నిన్
గానని దుష్టమానసుల గాల్చెడి శక్తి భవత్ప్రభమ్ములో
నే నడయాడు పావనుల నీతియు,నీ హృదయమ్ములోననే
కానగనౌనటంచు సనకాదులు దెల్పిరి మున్ను శాంకరీ॥ ౬౭

ఉ॥ భక్తిని నిన్ను నా ఋషులు-భవ్యులు-వేల్పులు,మేటి దిక్పతుల్
శక్తివిహీనులై యసురజాలముతో వెతజెంది వేడగా
భక్తులగావ నీ కరుణ-భాండమునే! తొణికింపజేయు నీ
శక్తిని జూప, దీనులను సాకగ వెల్గితివమ్మ శాంకరీ॥ ౬౮

చం॥ హరి హరులన్ విధాత యిడె నద్భుతతేజము వేడి నిన్ను బల్
విరివిగ దిక్పతుల్ గనుచు ప్రేమను శక్తుల తేజమిచ్చి ని
న్నరయగ నీవు మోహినివియై పదునెన్మిది బాహు లొప్పగా
దరిశన మిచ్చినావుగద! తల్లి! భవాని! శుభాంగి! శాంకరీ॥ ౬౯

ఉ॥ పాలసముద్రుడే మిగుల పల్చని యెఱ్ఱని పట్టుకోక ము
త్యాలను వెల్గు హారమిడ ;యాభరణాలు కిరీట కుండలాల్
మేలుగ విశ్వకర్మ యిడ ;మేలిమియౌ కడియాలు అందె ఉం
గ్రాలు విధాత యివ్వగను ;గాజులు నాకడలిచ్చె శాంకరీ॥ ౨౦

ఉ॥ వాడక యెండిపోకయె సువాసన వీడని పుష్పదామమే
వేడుకతోడ నప్పతిడె ;భీకరమై కడు పైడి వన్నె దూ
గాడెడి సింహవాహనము,కాంతిని వెల్గెడి రత్నహారముల్
గూడ గిరీశుడే యిడెను కూరిమితోడుత నీకు శాంకరీ॥ ౨౧

చం॥ హరి యిడె మేటికాంతిగల యద్భుతచక్రము నంతలోనె శం
కరు డిడె నా త్రిశూల మతికాంతిని వెల్గెడి శంఖమిచ్చె నా
వరుణుడు అగ్నిశక్తి యిడ; వాయువు చాపము నిచ్చె వేడ్కతో
కరుకుదనంపు శత్రువుల గట్టిగ కొట్టగ వేగ శాంకరీ॥ ౨౨

ఉ॥ ఆ యమరేంద్రు డిచ్చె కడు యమ్ములకూటము మేటి ఘంట వ
జ్రాయుధమున్ ;యముం డిడె విచారణ- దండము; బ్రహ్మ యిచ్చె దా
నా యెడ కత్తిడాలు ;ముదమంది యొసంగెను విశ్వకర్మ శో
భాయుతమైన గొడ్డలిని ;భక్తిని నిన్పుజియించి శాంకరీ॥ ౨౩

ఉ॥ వాదుకు బోవు నీకు సురపాత్ర నొసంగె కుబేరు డంత ;కౌ
మోదకి పేర వెల్గు గద ముందె విధాత యొసంగె; శానుడే
మోదముతోడ నా కవచమున్ తగుమేలగు నస్త్ర-శస్త్రముల్
నీ దరిజేరి గొల్చి యిడ నీచుల ద్రుంచగ నిల్చు శాంకరీ॥ ౨౪

ఉ॥ ఊదరగొట్టి లోకముల నూడ్చిన దుష్టుని గూల్చగాను బల్
కై దువుబట్టి సింగమును గైకొని యెక్కి సుధర్మరక్షకై
వేదనతోడ గొల్చియిడు వేల్పుల తేజమునంది భీకరా
మోదము తోడనే భువనమోహినివై వెలుగొందు శాంకరీ॥ ౭౫

చం॥ దురమున గూల్తు నా యెదుట దోషులు నిల్వగలేరటంచు నా
హరి హరు లెంచబల్కి కడు నద్భుతకాంతిని వెల్గి పెద్దగా
నరచియు నవ్వ ముజ్జగములన్నియు దద్దరిలంగ భూతముల్
వెరపు వహింప పాపతతి వెన్నులు ఝల్లనె మున్ను !
శాంకరీ॥౭౬

ఉ॥ దిక్కులు మారుమ్రోగ కడుదీనులు భక్తులు సంతసిల్ల; కై
పెక్కిన పాపమానసుల కెంతయు గుండె గు-భిల్లనంగ బల్
రక్కసిమూక భీతిలి విరాజితమై వెలుగొందుచున్న నీ
మిక్కుటమైన ధీరతకు మీదినియున్ చలియించె శాంకరీ॥ ౭౭

ఉ॥ ఎవ్వరి మాయచే జగములెల్లను మోహముజెందుచుండు నా
యవ్వవు నీవెయంచు తెలియన్గనలేని దురాత్ము డంత నీ
సవ్వడిగాంచి మోహమున సంతసమందెను, నిన్ను దాక నీ
కెవ్వరు సాటి? శత్రువులనే యుడికింతువు మాయ-శాంకరీ॥౭౮

చం॥ త్రిభువనమోహరూపమగు తేజముగాంచియు మోహవార్ధిలో
శుభమనిదల్చి తూలె రణశూరుడనంచు దురాత్ము డంత-నీ
విభవము నెంచలేక, కడు వేరడియై మదగర్వియయ్యె నీ
వె భువనమెల్లడన్ వెలయు విద్దెవుగా గనలేక శాంకరీ॥ ౭౯

చం॥ మహిషుని మంత్రులందరును పండినపాపులు తాంబ్రచిక్షులున్
బహువిధరూపరాక్షసులు బాష్కల-దుర్ముఖ-దుర్ధరాఖ్య-దు
ర్మహులును, వాని పంపుననె మార్కొన నిన్నట యుద్ధమందు,నీ
మహిమనుజూపి దుష్టపతి మంత్రుల గూల్పగలేదె
శాంకరీ॥ ౨౦

ఉ॥ చచ్చిరి మంత్రులంచు మహిషాసురు డంతట నాగ్రహమ్ముతో
పిచ్చిగ కేకవేయుచును భీతియులేకయె క్రూరబుద్ధితో
వచ్చి ధనస్సుచేకొనియు ఖండనమందున నిల్చినంత నా
రెచ్చిన పాపు డబ్బురపు రీతినిజూడగ బోరు శాంకరీ॥ ౨౧

ఉ॥ మానవురూపు వీడి హరిమాడ్కిని నిల్చియు పోరి ఓడియున్
ఏనుగరూపుతో నిలువ నేమియు లాభములేక వెంటనే
మానుగ నెన్నొ రూపముల మారిన పోర జయమ్ము లేమిచే
దా నిజరూపుతో మహిషదైత్యుడు పోరగనిల్చె శాంకరీ॥ ౨౨

ఉ॥ కోరలు బెంచి పావనుల గూల్చెడి దుష్టుని మాయలింక పై
నారయలేక భీకరమునౌ ధ్వనిజేయుచు నవ్వుచున్ సహ
స్రారముపేర వెల్గు నిజచక్రము శత్రువుపైకిబంపి బల్
కారులు బేలు నా మహిషు కాలము దీర్చితి వంత శాంకరీ॥ ౨౩

ఉ॥ ద్వేషములార్చి నీ విమలతేజముతోడ ప్రశాంతిగూర్చి ని
ర్దోషుల ప్రేమ నేలెదవు దుష్పథమెల్లను గూల్చివైచుచున్
దోషవిహీనమై కరుణతో వెలుగొందెడు నీ సుగీతలో
భాషల భావమెంచుటకు భక్తుడె యొప్పుగదమ్మ శాంకరీ॥౭౪

చం॥ విడచి సమస్త ధర్మములు ప్రేమ విశాలపు సత్యమార్గముల్
గడగడలాడ లోకముల గట్టియు కొట్టు విరోధిగుండియల్
దడదడలాడజేయదగు దానవ భీకరమూర్తి వైన నీ
యెడ కడు భక్తులే నిలతు రింపుగ తత్వమునెంచి శాంకరీ॥౭౫

చం॥ అరయగ ధూమ్రలోచనులు నాదటశుంభుడు చండముండులున్
సురలను హింసబెట్టెడి నిశుంభుడు, పాపుడు,రక్తబీజుడున్
దురితపథానువర్తులను దోలి సుశాంతిని నిల్పినట్టి నీ
కరుణ నెరుంగ సాధ్యమగుకార్యము గాదుగదమ్మ శాంకరీ॥౭౬

ఉ॥ లోకులమాడ్చువారి ననిలో హతమార్చగ నిల్చినట్టి నీ
భీకరరూపు జూచి కడు భీతిలుచుందురు నిన్ను జేరగా
నీ కృపనెంచు మార్గముల నేర్వమి నంతియెగాని లోకముల్
సాకెడు నిన్ను వేడుకొను సాధుల కాపదలున్నె శాంకరీ॥ ౭౭

చం॥ వసుధను కాళిదాసు కడుభక్తిని నిన్గని కొల్చినంత స
ర్వసుఖములిచ్చి యా బుధుని పండితుజేసిన నీ దయారసం
బసదృశమైన కీర్తి నిడెనమ్మ జగాన, అపారప్రేమ నీ
దెస వెలుగొందుగాని జగతిన్ వెలుగొందికయున్నె
శాంకరీ॥౮౮

ఉ॥ నీ కరుణాకటాక్షముననేగద ! మున్నల కాళిదాసు బల్
చీకటిరేయి పున్నమనిజెప్పియు నిన్ను భజించి యోడకన్
ఆకసమందు పూర్ణశశి నందరకున్ గనుమంచుచూపె నీ
యీ కథలెల్ల ప్రేమరసమే తొణికించునుగాదె ! శాంకరీ॥౮౯

ఉ॥ నాడు శివాజి వేద ఖల నాశనమున్ తగజేయుమంచు నీ
వాడి మహాత్మ నేలితివి యద్భుతశక్తినొసంగి భక్తి నిన్
వేడెడివారి మానసము నెంచియు కోర్కెలదీర్చి కాతువే
కూడిన పాపజాలములకున్ తగు పాశమువైచి శాంకరీ॥౯౦

ఉ॥ ఏగతి నెంచు వారలకు నింపుగ నాగతి గల్గజేతువే
రోగుల - భోగులన్ విమలరూపుల హీనుల బుద్ధిమాంద్యులన్
రాగుల సాధులన్ అబలరక్షకులన్ తగ జేయుశక్తి వీ
వే గద తల్లి ! ప్రేమనిధి, వేదమయీ! జగదంబ! శాంకరీ॥౯౧

ఉ॥ అమ్మ సుధాత్రివమ్మ, విజయమ్మ - సకర్మ - సభక్తివమ్మ; రా
జమ్మ, సదాలకొమ్మ, యిల సజ్జనకర్మ-సుశాంతివమ్మ; ల
క్ష్మమ్మ, సదాత్మవమ్మ, బహుసాధులధర్మ-విధాత్రివమ్మ; గౌ
రమ్మ, భవానివమ్మ, జగదంబన నీవెగదమ్మ! శాంకరీ॥ ౯౨

ఉ॥ విద్యలయందు రక్తి, బహువీరులబాహులలోని శక్తి, యా
విద్యనువెల్గు యుక్తి, కడుప్రేమనువెల్గెడి శక్తి, శ్రీసభా
విద్యనునిల్పు రక్తి, ధర వీరులలోగల మేటి యుక్తి స
ద్విద్యనుదాగు భక్తి, కడు ధీరులముక్తియు నీవెశాంకరీ॥ ౯౩

ఉ॥ భక్తుల ముక్తి, జీవతతి పాలనశక్తి, విధాత యుక్తి, శ్రీ
శక్తి; సభానురక్తి; కడు శాంతిసుశక్తి, సజీవభక్తి, భూ
శక్తి, విరక్తి, రాజ్యరమసంతతి ముక్తియు, ధర్మశక్తి, మా
భక్తివి, ఆదిశక్తి విల భండనరక్తి నీవె శాంకరీ॥ ౯౪

ఉ॥ ఆత్రమునందు తాపము, అయాచితధర్మము, విప్రకర్మ- స
ద్గోత్రమునందు మూలమును, కూళలశూలము, భక్తచిత్తమున్
శాత్రవులందు సూత్రము, సశాంతి తపమ్ము, సుబుద్ధిరూపమున్
క్షేత్రమునందు పుణ్యము, విశేషబలమ్మన నీవె శాంకరీ॥ ౯౫

ఉ॥ ఇమ్మహి శక్తి నీవు, పరమేశ్వరి నీవు జగాలకెల్ల, నీ
వమ్మవటంచు మున్ పరమహంసలు, ధీరులు, యోగు లెందరో
సమ్మతిగాను దెల్పి రిట శాంతిని నిల్పెడి దేవివంచు నీ
సొమ్ము జగద్భవప్రతిభ-శోభ-సుశాంతియు-కాంతి!
శాంకరీ॥ ౯౬

ఉ॥ మానవశక్తియన్న యనుమానము లే దది నీవె తల్లి! నిన్
గానక నీవు నే నను వికారపుపల్కులు బల్కి, తల్లి నే
గానని ధర్మహీనులై కర్మల జేతురు దుష్టబుద్ధితో
గానని వారికిన్ శుభముగల్గగ జాతువుగాదె! శాంకరీ॥ ౯౭

ఉ॥ నీ మహిమంబు ధర్మమను నిర్మలసౌధములోన శాంతి గా
దే! మదమత్సరమ్ములనె ద్రుంచియు నీ కలి రామకృష్ణ డా
స్వామియు ధీరభక్తుడు భవత్పదయుగ్మము జూపె మేటి నీ
ప్రేమను దూచి దెల్పెడి కవీంద్రుల చిత్తము నీవె!
శాంకరీ॥ ౯౮

ఉ॥ నీ యపురూపతేజములనే మది గొల్చియు నమ్మువారిలో
నే యలరారుచుందువంట! నేర్పున నాదిభట్ట నా
రాయణదాసు నమ్మగ విరాజితకీర్తి నొసంగలేదె, నిన్
బాయక నమ్మువారలకు భాగ్యము నీవెగదమ్మ! శాంకరీ॥ ౯౯

చం॥ ఇట నిను నమ్మి వెంకటకవీంద్రులు కీర్తినిగాంచి రింక వేం
కట రమణయ్యదాసు కలికాలపువారలె భక్తులన్న మొ
న్నటి నిజదాసులేగద ! ఘనంబగు నీ పదభక్తి నావచే
పటుతరమైన కీర్తి నది బాటలు జూపిరిగాదె ! శాంకరీ॥౧౦౦

మంగళమో ! మహేశ్వ రిదె
మంగళహారతిగొమ్మ భైరవీ!
మంగళమమ్మ కప్పురపు
మంగళహారతి కాళికాంబ! శ్రీ
రంగము సీతరామయను
రక్షణ జేసెడి భారతీ దయన్
మంగళహారతిన్ గొనుమ
మాత భవాని ! శుభాంగి ! శాంకరీ॥

—సమాప్తం—

శ్రీరంగం శీతారామయ్యగారి
రాబోవు గ్రంథములు

నాటకం:

నిష్కామ్యపూజ

శ్రీ దేవీ హరికథలు:

1. మధుకైటభ - వధ
2. మహిషాసుర మర్ధని

పద్యకావ్యము:

భద్రగిరి వైభవము

కీర్తనలు:

భద్రాద్రి రామనామ భజన కీర్తనలు

వివరములకు :—

నల్లూరి సర్వేశ్వరరావు,

కిరాణా, ఫాన్సీ, ఐరన్ అండ్ బుక్‌షాప్

భద్రాచలం. (తూ. గో. జిల్లా.)

ముద్రణ :

కల్యాణి ప్రెస్,

మున్సిపల్ ఆఫీసు రోడ్డు,

విజయవాడ-1.

మా వద్ద

స్కూళ్ళకు పనికివచ్చే తెలుగు పుస్తకములు, ఎక్సర్ సైజు, డ్రాయింగు, స్టూడెంటు నోటు బుక్కులు, అకౌంట్ పుస్తకములు, కంపస్ బాక్సులు, కలర్ బాక్సులు, పెన్సళ్లు, కలాలు వగైరా స్టేషనరీ సామాన్లు, ఇతర రకముల పుస్తకములు దొరకును.

ఫాన్సీ గూడ్సు, గాజు సామానులు, ఇనుప వస్తువులు, రంగులు, కిరాణా సరుకులు, నాగపూర్ సున్నం డబ్బాలు. పుగాకు బేరన్లకు వుపయోగించు యినుప సామానులు, కైళ్లు, మేకులు వగైరా సరసమైన ధరలకు దొరకును. ప్రశస్తమైన కస్తూరి, జున్ను లభించును.

నల్లూరి సర్వేశ్వరరావు,

కిరాణా, ఫాన్సీ, ఐరన్ అండ్ బుక్ షాప్,

భద్రాచలం. (తూ. గో. జిల్లా.)

13423